రైతు కుటుంబానికి ప్రభుత్వ విప్ ఐలయ్య పరామర్శ

రాంచంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లి, మార్చి 3 : మండలంలోని వీరారెడ్డిపల్లిలో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు మంద రాంచంద్రయ్య కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఆలేరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఐనాల చైతన్యామహేందర్‌రెడ్డి, నాయకులు శంకర్ నాక్, భాస్కర్‌రెడ్డి, మోహన్‌బాబు పాల్గొన్నారు.

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజుగౌడ్

కలెక్టర్ కార్యాలయ ఏఓ జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 3 : జిల్లాలో అనావృష్టి కారణంగా కరువు ఛాయలు ఏర్పడి పంటలు ఎండిపోయాయని, జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డీఏఓ గోపాల్, కలెక్టర్ కార్యాలయ ఏఓ జగన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు, బావుల కింద వేలాది ఎకరాల్లో పంటలు పొట్ట దశ ఎండిపోయాయన్నారు. అధికార యంత్రాంగం వివరాలను సేకరించి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం ఇప్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని, తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, జిల్లా నాయకులు మచ్చ భాస్కర్, గడ్డమీది సోములు, పాండాల మైసయ్యగౌడ్, రంగా కొండల్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

డీఆర్‌డీఓ నాగిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 3 : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకుల సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బబ్బూరి శంకర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పనిచేసినప్పటికీ రెండు నెలల నుంచి వేతనాలు అందడం లేదన్నారు. జిల్లాలో సస్పెండ్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఐడీ కార్డు జారీ చేయాలని, ఉపాధి హామీ పనులపై శిక్షణ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంకల సిద్ధిరాజు, జనరల్ సెక్రటరీ బైరగోని రమేశ్, కోశాధికారి ఉపేందర్, రజిత, నర్సింహ పాల్గొన్నారు.

పాల రైతుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

మదర్ డెయిరీ మేనేజర్ దశరథకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 3 : జిల్లా పరిధిలోని మదర్ డెయిరీ, విజయ డెయిరీల పాల సెంటర్లలో పాలు పోస్తున్న పాడి రైతుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. పాడి రైతుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని 3బిఎన్‌జి22: మదర్ డెయిరీ మేనేజర్ దశరథకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు మదర్ డెయిరీ మేనేజర్ పంచెద్దుల దశరథకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు 5నెలల నుంచి బిల్లులు చెల్లించడం లేదని, నెలలో రెండు పర్యాయాలు ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వడం లేదని అన్నారు. గత ప్రభుత్వం పాడి రైతులకు 4రూపాయలు ఇన్సెంటివ్ ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, సభ్యులు లింగం, రమేశ్, యాదగిరి పాల్గొన్నారు.

'మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 3 : భువనగిరిలో ఈ నెల 15న జరిగే మహాప్రదర్శనకు వస్తున్న ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు కోరారు. పట్టణంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన ఆ సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ నెల 4నుంచి 10వరకు మండల, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో దప్పు ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. మాదిగలకు రెండు మంత్రి పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తులకు గుణపాఠం చెప్పడానికి ఈ నెల 15న జిల్లా కేంద్రంలో నిర్వహించే మహా ప్రదర్శనకు మాదిగలు, మాదిగ ఉప కులాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, నాయకులు గోసంగి పరమేశ్, మంద శంకర్, ఇటుకల దేవేందర్, సందెల శ్రీనివాస్, జానీ, దానయ్య, శ్రీనివాస్, దేవదాస్, సురేందర్ పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

పోలీసులు సీజ్ చేసిన ఇసుక డంప్

వలిగొండ, మార్చి 3 : మండలంలోని వేములకొండ గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా మూసీ పరీవాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలించి వ్యాపారం చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సోమవారం దాడి చేసి సుమారు 40 టన్నుల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా తరలించి డంప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

వినికిడి లోపాన్ని అశ్రద్ధ చేయెద్దు

- నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వీణ

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వీణ

బీబీనగర్, మార్చి 3 : వినికిడి శక్తి చాలా విలువైందని, వినికిడి లోపాన్ని అశ్రద్ధ చేయొద్దని నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వీణ అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినికిడి లోపంపై విద్యార్థులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెవిలో చీము కారడం, సరిగా వినపడకుండా అనిపించడం, బీపీ పెరుగడం, గుండె సమస్యలు మొదలైన వాటికి వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. పిల్లల చెవిలోపల బలపాలు, పెన్సిళ్లు, అగ్గిపుల్లలు పెట్టవద్దని, చెవిలో నూనె పోయడం వల్ల ఇతర ఇన్‌ఫెక్షన్లు వస్తాయని తెలిపారు. దీనివల్ల చెవిలోని పొర చిరిగిపోయి చెవుడు ఏర్పడుతుందన్నారు. చెవిని కూడా కన్నులాగే జాగ్రత్తగా చూసుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, ఇస్తారి, డీపీసీ శాంతకుమారి, ఎంపీహెచ్ఎస్ ప్రభాకర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నా బిడ్డను పొట్టన పెట్టుకున్న హంతకుడిని కఠినంగా శిక్షించాలి

- రుద్రాక్షి తల్లిదండ్రులు దుర్గ, కృష్ణ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రుద్రాక్షి తల్లిదండ్రులు దుర్గ, కృష్ణ

మోత్కూరు, మార్చి 3 : ప్రేమ పేరుతో శారీరకంగా అవసరాలను తీర్చుకొని చిత్రహింసలకు గురి చేసి తన బిడ్డను పొట్టన పెట్టుకున్న హంతకుడిని కఠినంగా శిక్షించాలని ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన ఇస్లావత్ దుర్గ, కృష్ణ దంపతులు పోలీసులను కోరారు. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో యువతి రుద్రాక్షి (18) ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. స్థానిక పోలీసుల సమాచారం మేరకు రుద్రాక్షి తల్లిదండ్రులు, బంధువులు సోమవారం మోత్కూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన కందుకూరి మున్నా ఇన్‌స్టాగ్రామ్‌లో రెండేండ్ల కిత్రం తమ బిడ్డ రుద్రాక్షితో పరిచయం ఏర్పరుచుకున్నాడన్నారు. మైనర్ అయిన తమ బిడ్డను మాయమాటలతో ప్రేమ పేరుతో వంచించి, ఇంటి నుంచి వచ్చేలా ప్రేరేపించాడని తెలిపారు. డిసెంబర్ 31న తమకు చెప్పకుండా ఇంట్లో నుంచి వచ్చిందని, మూడు రోజులకు తమకు ఫోన్ చేసి తాను మున్నాతో మోత్కూరులో ఉంటున్నానని చెప్పిందన్నారు. పరువును కాపాడుకోవడం కోసం ఎవరికీ చెప్పకుండా ఆమె ఆచూకీ కోసం వాకబు చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో తమ బిడ్డ రెండు, మూడ్రోజులకోసారి ఫోన్ చేసి మున్నా తన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, కొడుతున్నాడని, డబ్బుల కోసం వేధిస్తున్నాడని చెప్పేదన్నారు. బిడ్డను ఇంటికి రమ్మని కోరామని చెప్పారు. మీ వాళ్ల దగ్గరకు వెళ్తే తాను చనిపోతానని బెదిరించి చిత్రహింసలకు పాల్పడుతుండే వాడని తెలిపిందన్నారు. మూడు రోజుల క్రితం వీడియో కాల్ చేసి రూ.15వేలు కావాలని అంటున్నాడని చెప్పిందని విలపించారు. ప్రేమ పేరుతో వంచన చేసి డబ్బుల కోసం వేధించడం వల్లే తమ కుమార్తె తట్టుకోలేక ఈ అఘాయిత్యానికి పాల్పడిందన్నారు. తమకు ఒక్కగానొక్క బిడ్డ కావడంతో అల్లారుముద్దుగా కాయ కష్టం చేసి సాదుకున్నామని కన్నీరు పెట్టారు. తమ బిడ్డ చావుకు కారణమైన హంతకుడిని కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

సీఐ విచారణ

రుద్రాక్షి ఆత్మహత్య ఘటనపై మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు సోమవారం విచారణ చేపట్టారు. మృతురాలి సూసైడ్ నోట్‌ను తల్లిదండ్రులకు చూపించారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

బీబీనగర్, మార్చి 3 : రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె.కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ నుంచి పగిడిపల్లి రైల్వేస్టేషన్ కిలోమీటర్ నం 227/13-15 మైలు రాయి వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందాడు. మృతుడు సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉంటాడని, నల్ల టీషర్టు, తెల్లని ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్ 9848222169, 8712568454 ద్వారా సంప్రదించి సమాచారం అందించాలని సూచించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి దుర్మరణం

బీబీనగర్, మార్చి 3 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సురకంటి అజయ్‌రెడ్డి (36) సోమవారం తన వ్యవసాయ బావి వద్ద చెత్తను తగులబెట్టాడు. మంటల దాటికి పైన ఉన్న కరెంటు తీగలు తెగిపోయి కిందపడ్డాయి. ఆ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో అజయ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అజయ్‌రెడ్డి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కారులో అకస్మాత్తుగా మంటలు

మంటల్లో దగ్ధమవుతున్న కారు

తుర్కపల్లి, మార్చి 3 : మండలంలోని వాసాలమర్రి గ్రామ సమీపంలో భువనగిరి - గజ్వేల్ ప్రధాన రహదారిపై సోమవారం ప్రమాదవశాత్తు కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సిద్దిపేట నుంచి కారులో నలుగురు వ్యక్తులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బయల్దేరారు. వాసాలమర్రి సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారు ఇంజిన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన కారులో ప్రయాణిస్తున్న వారు కారు డోరు తీసుకొని బయటికి పరుగులు తీశారు. దాంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనాస్థలానికి పోలీసులు చేరుకొని ఫైరింజన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సహకారంతో పోలీలులు మంటలను ఆర్పివేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్, మార్చి 3 : మండలంలోని లింగోజిగూడెం గ్రామ పరిధిలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. భద్రాచలం నుంచి పేపర్ లోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ లింగోజిగూడెం వద్ద ఆగి ఉన్న మరో లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామానికి చెందిన పేపర్ లోడ్ లారీ డ్రైవర్ అనిల్‌కుమార్(38)కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గణేశ్ అకాల మరణం సీపీఎంకు తీరనిలోటు

- మున్సిపల్ మాజీ చైర్మన్ శంకరయ్య

గణేశ్ భౌతికదేహానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ పస్పరి శంకరయ్య

ఆలేరు టౌన్, మార్చి 3 : డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బోనగిరి గణేశ్ అకాల మరణం సీపీఎంకు తీరని లోటని ఆలేరు మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. ఆలేరు పట్టణానికి చెందిన గణేశ్ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో 5రోజులుగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన భౌతికదేహానికి సోమవారం శంకరయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా నాయకులు కల్లూరి మల్లేశం, మాటూరి బలరాజు, దాసరి పాండు, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేశ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో మాజీ జడ్పీటీసీ మంద లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు బింగి సత్యనారాయణ, ఎండీ గోరెమియా, జింకల భరత్ యాదవ్, సీపీఎం నాయకులు మన్నె నర్సింహులు, జూకంటి పౌల్, ఎంఏ ఇక్బాల్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, కాలనీ వాసులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించాలి : బీఆర్ఎస్

మోత్కూరు, మార్చి 3 : మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణ నిర్మాణ పనుల్లో నిబంధనలు పాటించడం లేదని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి అన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మున్సిపల్ పాలకవర్గం పట్టణ ప్రధాన రోడ్డును డివైడర్‌కు ఇరువైపులా 40 ఫీట్ల వెడల్పుతో విస్తరణకు తీర్మానం చేసిందన్నారు. పోతాయిగడ్డలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ఉన్న ప్రధాన రోడ్డుకు ఇరువైపులా 40 ఫీట్ల వెడల్పు ఉండాల్సినప్పటికీ అధికార పార్టీకి చెందిన కొందరు రాజకీయ లబ్ధి కోసం 25-30 ఫీట్ల వరకే విస్తరణ పనులు చేపట్టారని తెలిపారు. వీటిపై పర్యవేక్షణ చేయాల్సిన మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. షాపుల వారి నుంచి కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేసుకొని వారికి అనుకూలంగా రోడ్డు వెడల్పును మార్చారని ఆరోపించారు. అదేవిధంగా పట్టణంలోని సీసీ, బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించడం లేదని, అధికారులు పర్యవేక్షణ చేసి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు విస్తరణలో అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

'కొండపైన స్థానిక కళాకారులకు అవకాశం కల్పించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

యాదగిరిగుట్ట, మార్చి 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఈ ప్రాంతానికి చెందిన సింధు యక్షగాన, కోలాట బృందాలతో పాటు బాగోతం, భజన, డప్పు డోలు, హరికథలు, పంబాల కళాకారులకు అవకాశం కల్పించాలని ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజానాట్య మండలి నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై పలు మార్లు దేవస్థాన ఈఓకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా గుర్తించి సాంస్కృతిక కార్యక్రమాల్లో వారికి అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంజ హేమలత, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్లెం కృష్ణ, మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండి జంగమ్మ, రైతు సంఘం నాయకులు పేరబోయిన బంగారి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం రూ.50వేల విరాళం

గ్రామస్తులకు విరాళం అందజేస్తున్న పారిశ్రామికవేత్త రాంరెడ్డి

మోత్కూరు, మార్చి 3 : మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురంలో వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం పారిశ్రామికవేత్త ఏగమాటి రాంరెడ్డి సోమవారం గ్రామస్తులకు రూ.50వేల విరాళం అందజేశారు. మున్సిపాలిటీలోని 9వ వార్డు పరిధి కొండాపురంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. స్థానికుల విన్నపం మేరకు దాత విరాళం అందించారు. కార్యక్రమంలో నాయకులు పైళ్ల సోమిరెడ్డి, నర్సిరెడ్డి, వెంకన్న, బాబు, వెంకటేశ్, శ్రీనివాస్, రవి, ప్రశాంత్, సత్యనారాయణ, నవీన్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- డీపీఓ సునంద

గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి మాట్లాడుతున్న డీపీఓ సునంద

ఆత్మకూరు(ఎం), మార్చి 3 : మండలంలోని అన్ని గ్రామాల్లో నివాసం ఉంటున్న ఇండ్లు, ప్లాట్ల వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని డీపీఓ సునంద అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయడంతోపాటు రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందున మంచినీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ రాములునాయక్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్, బిల్ కలెక్టర్ సుదర్శన్ ఉన్నారు.

లాడ్జీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి : ఏసీపీ

లాడ్జీల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏసీపీ రాహుల్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 3 : లాడ్జీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని భువనగిరి ఏసీపీ రాహుల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడాయిగూడెం గ్రామ పరిధిలోని పలు లాడ్జీల్లో రూరల్ సీఐలు ఎన్.చంద్రబాబు, వి,సంతోష్‌కుమార్‌తో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా నిబంధనలు పాటించాలన్నారు. వచ్చిపోయే వారి వివరాలను పక్కాగా నమోదు చేయాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. లాడ్జీల్లో ఎవరైనా అనుమానాస్పద స్థితిలో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఎల్ ఆర్ఎస్ ఫీజులో రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

- చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి

చౌటుప్పల్, మార్చి 3 : ఎల్ఆర్ఎస్ ఫీజులో 25శాతం రాయితీ అవకాశాన్ని ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 సంవత్సరంలో రూ.వెయ్యి చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం రిజిష్టర్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ నెల 31వరకు ఈ సదుపాయం ఉందని తెలిపారు. 2020కి ముందు అనుమతి లేని లేఅవుట్లలో 10శాతం రిజిస్ట్రేషన్ అయ్యి మిగతావి కానివారు కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్, ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించి ఈ రాయితీ పొందవచ్చన్నారు.

ఆహారం, ఆరోగ్యంపై మహిళలకు శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం కిరణ్

ఆత్మకూరు(ఎం), మార్చి 3 : మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో పౌష్టికాహారం, ఆరోగ్యంపై మహిళా సంఘాల సభ్యులకు సోమవారం ఒక్క రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం కిరణ్ మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళా సమైక్య అధ్యక్షులు రోజూ పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఆరోగ్య కమిటీ సభ్యులందరూ మహిళా సంఘాల సభ్యులకు ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసి పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం ఆనంద్, సంఘబంధం అధ్యక్షురాలు లక్ష్మి, సీసీ భాస్కర్, కంప్యూటర్ అపరేటర్ చంద్రస్వామి, వీబీకేలు పాల్గొన్నారు.

'విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి'

మాట్లాడుతున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆండాలు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 3 : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరుడు ఆండాలు అన్నారు. పట్టణంలోని రాయగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆర్థిక సహకారంతో రాజరాజేశ్వరి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 15రోజుల పాటు విద్యార్థులకు, గ్రామ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా సోమవారం పాఠ